Email : telanganaveenaofficial@gmail.com
Title Code : 12280
# తెలంగాణవీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
epaper.telanganaveena.com హైదరాబాద్ శుక్రవారం 28-06-2024
స్పాట్ ఎడిషన్

### కేటీఆర్ ఉన్న సిరిసిల్లలో బీజేపీకి ఎక్కువ ఓట్లు పడతాయా?:

# రేవంత్ రెడ్డి విమర్శలు

తెలంగాణవీణ, హైదరాబాద్



* అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓట్లు భారీగా తగ్గాయన్న సీఎం
* కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు బీఆర్ఎస్... బీజేపీకి మద్దతు పలికిందని విమర్శ
* పీవీకి రేవంత్ రెడ్డి నివాళులు

లోక్ సభ ఎన్నికల్లో 17 సీట్లలో ఓడిపోయి... ఎనిమిది సీట్లలో డిపాజిట్ కోల్పోయి, 14 సీట్లలో మూడో స్థానం వచ్చినప్పటికీ కేసీఆర్‌కు కనువిప్పు కలగలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయకపోవడం ప్రజల తప్పే అన్నట్లుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో 37 శాతం ఓట్లు సాధించిన బీఆర్ఎస్... లోక్ సభ ఎన్నికల నాటికి 16 శాతానికి పడిపోయిందన్నారు.కేటీఆర్ నియోజకవర్గం సిరిసిల్లలో బీజేపీకి అత్యధిక ఓట్లు వచ్చాయని, సిద్దిపేటలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు దాదాపు సమానంగా వచ్చాయన్నారు. కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు బీఆర్ఎస్... బీజేపీకి మద్దతు పలికిందని ఆరోపించారు. బీఆర్ఎస్ తమ కంచుకోటగా చెప్పే మెదక్‌లో కూడా ఆ పార్టీ మూడో స్థానానికి పడిపోయిందన్నారు.సొంత పార్టీ ఎమ్మెల్యేలను మొన్నటి వరకు గేటు వరకు కూడా రానీయలేదని... కానీ ఇప్పుడు ఫామ్ హౌస్‌కు పిలిచి భోజనాలు పెడుతున్నారని విమర్శించారు. ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి రమ్మంటే రానీయలేదన్నారు. తెలంగాణ సంబరాల్లో పాల్గొనడానికి ఇష్టపడని... ప్రజాప్రభుత్వాన్ని పడగొట్టాలని భావిస్తున్న... కేసీఆర్ తీరు సరికాదన్నారు.

**పీవీకి రేవంత్ రెడి నివాళులు**

మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. నేడు పీవీ జయంతి సందర్భంగా ఢిల్లీలోని అధికారిక నివాసంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... సంస్కరణలతో దేశ ఆర్థిక ప్రగతిని పీవీ పరుగులు పెట్టించారన్నారు. పీవీ చిత్రపటానికి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు నివాళులర్పించారు.

# ఎమ్మెల్సీ కవితను కలిసిన మాజీ మంత్రి హరీశ్ రావు

తెలంగాణవీణ, హైదరాబాద్



* ములాఖాత్ సందర్భంగా కవిత యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న హరీశ్ రావు
* ఇటీవలే కవితను కలిసిన మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి
* ఇటీవలే కవిత జ్యుడీషియల్ కస్టడీని మరోసారి పొడిగించిన రౌస్ ఎవెన్యూ కోర్టు
* దీంతో జులై 5వ తేదీ వరకు తీహార్ జైల్లోనే ఉండనున్న కవిత

తీహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను మాజీ మంత్రి హరీశ్ రావు శుక్రవారం ఉదయం కలిశారు. ఈ ములాఖాత్ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కాగా, ఇటీవలే మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, కేటీఆర్ కవితను కలిసిన విషయం తెలిసిందే. ఇక ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని కోర్టు మరోసారి పొడిగించిన సంగతి తెలిసిందే. జులై 5వ తేదీ వరకు ఆమె కస్టడిని పొడిగిస్తూ ఢిల్లీ రౌస్ ఎవెన్యూ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

# నితిన్ గడ్కరీతో ఈటల భేటీ

తెలంగాణవీణ,జాతీయం



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని శుక్రవారం మల్కాజ్ గిరి ఎంపీ ఈటల కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో ఉన్న సమస్యలను ఈటల గడ్కరీకి వివరించారు. అనంతరం మీడియాతో ఈటల మాట్లాడుతూ.. కొంపల్లిలో ఫ్లై ఓవర్లు, అండర్ పాస్, నత్తనడక నడుస్తున్న ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్, శామీర్ పేట రోడ్డు, Lb నగర్ అండర్ పాస్, హుజూరాబాద్ రోడ్డు సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో అన్నీ అండర్ పాస్‌లు కాకుండా ఫ్లై ఓవర్‌లు నిర్మించాలని కోరినట్లు పేర్కొన్నారు. హుజూరాబాద్‌లో సింగాపూర్, రాంపూర్, రంగాపూర్, పెద్దపాపాయపల్లిలో రైతులకు ఇబ్బంది లేకుండా సర్వీస్ రోడ్డు నిర్మాణం చేయాలని కోరామన్నారు. నితిన్ గడ్కరీ త్వరలో సమగ్రంగా మరో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఈటల స్పష్టం చేశారు.

# అత్యంత రద్దీ కలిగిన హైవేకు మోక్షం..

తెలంగాణవీణ, హైదరాబాద్




దేశంలోనే అత్యంత వాహనాల రద్దీ కలిగిన హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి విస్తరణకు మోక్షం కలిగింది. ఈ రహదారిని ఆరు లైన్లుగా విస్తరించేందుకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. ఆరు లైన్ల విస్తరణ పనుల కోసం కాంట్రాక్టర్ ఖరారు అయ్యేవరకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా టోల్ వసూలు చేయనుంది. ప్రస్తుత గుత్తేదారు జీఎంఆర్ సంస్థ స్థానంలో ఎన్ఎహెచ్ఏఐ జూలై ఒకటవ తేదీ నుంచి ఈ టోల్ చార్జీలను వసూలు చేయనుంది.ఉమ్మడి రాష్ట్రంలో 9 నెంబర్ జాతీయ రహదారిగా పేరున్న హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి యాక్సిడెంట్లకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది. రెండు లైన్లుగా ఉన్న ఈ హైవేను రూ.1740 కోట్లతో బీవోటీ పద్ధతిన జీఎంఆర్ సంస్థ నాలుగు లైన్లుగా విస్తరించింది. విస్తరణ సమయంలోనే ఆరు లైన్లకు సరిపడా భూసేకరణ జరిపారు. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం నుంచి ఏపీలోని నందిగామ వరకు 181 కిలోమీటర్ల పొడవున రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించింది. 2012లో తెలంగాణలో పంతంగి, కొర్లపహాడ్, ఏపీలో చిల్లకల్లు వద్ద టోల్ ప్లాజాలతో టోల్ వసూలు చేస్తోంది. జీఎంఆర్ టోల్ వసూలుకు 2025 జూన్ వరకు గడువు ఉంది. అయితే 2024 వరకు ఎన్ ఎచ్ 65ను ఆరు లైన్లుగా విస్తరించేలా ఆ సంస్థతో ఒప్పందం కుదిరింది.ఆరు లైన్ల విస్తరణపై కోర్టుకు వెళ్లిన జీఎంఆర్.తెలుగు రాష్ట్రాల విభజనతో తమకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, ఈ నేపథ్యంలో హైవేను ఆరు లైన్లుగా విస్తరించడం కష్టమని జీఎంఆర్ కోర్టును ఆశ్రయించింది. రాష్ట్ర విభజనతో ఇసుక లారీలు రాకపోకలు తగ్గిపోయాయని, దీంతో రోజుకు రూ.20 లక్షల చొప్పున నెలకు రూ.6 కోట్ల వరకు నష్టం వాటిల్లుతోందని ఈ సంస్థ తరఫు న్యాయవాదులు వాదించారు. గడువు కన్నా ముందే టోల్ వసూలు బాధ్యత నుంచి వైదొలగేందుకు జీఎంఆర్ అంగీకరించింది. దీనికి ఆ సంస్థకు నష్టపరిహారం చెల్లించేందుకు ఎన్ ఎచ్ ఏ ఐ ఒప్పందం చేసుకుంది.

### బీఆర్ఎస్ పార్టీకి మరో ఎదురుదెబ్బ

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో ఘోర పరాభవాన్ని ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా కాంగ్రెస్ పార్టీలో చేరుతూ అధినేత కేసీఆర్‌కు వరస షాకులిస్తున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఢిల్లీకి వెళ్లి ఏఐసీసీ నేతలు, సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

# టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరణ



తెలంగాణవీణ, ఏపీ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల్లో గాజువాక నుంచి రికార్డు విజయం సాధించిన పల్లా శ్రీనివాసరావు
పల్లా శ్రీనివాసరావును టీడీపీ ఏపీ అధ్యక్షుడిగా నియమించిన చంద్రబాబు
నేడు బాధ్యతలు చేపట్టి చంద్రబాబుకు, లోకేశ్ కు ధన్యవాదాలు తెలిపిన పల్లా శ్రీనివాసరావు

గాజువాక అసెంబ్లీ స్థానం నుంచి రికార్డు మెజారిటీతో ఎన్నికైన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు టీడీపీ ఏపీ అధ్యక్షుడిగా నియమితుడు అవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, పల్లా శ్రీనివాసరావు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నేడు బాధ్యతలు చేపట్టారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ రాష్ట్ర నాయకత్వ బాధ్యతలను తనకు అప్పగించిన చంద్రబాబు, నారా లోకేశ్ లకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని వెల్లడించారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. పల్లా శ్రీనివాసరావు అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ పై 95,235 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో ఇదే అత్యధిక మెజారిటీ కావడం విశేషం. పల్లా శ్రీనివాసరావు బీసీ (యాదవ) సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. గతంలో ఆయన విశాఖ పార్లమెంటరీ స్థానం టీడీపీ ఇన్చార్జిగా సమర్థవంతంగా

# జూన్ 30న ఏపీ మెగా డీఎస్సీ నోటిఫికేషన్..

తెలంగాణవీణ, ఏపీ బ్యూరో



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు ఎప్పుడెప్పుడాని ఎదురు చూస్తున్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్ మరో రెండు రోజుల్లో వెలువడనుంది. డీఎస్సీతో పాటు మరోమారు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన టెట్‌లో అర్హత సాధించని వారితోపాటు ఈ ఏడాది కొత్తగా బీఈడీ, డీఈడీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు కూడా డీఎస్సీ రాసేందుకు అర్హత కల్పించాలనే..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు ఎప్పుడెప్పుడాని ఎదురు చూస్తున్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్ మరో రెండు రోజుల్లో వెలువడనుంది. డీఎస్సీతో పాటు మరోమారు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన టెట్‌లో అర్హత సాధించని వారితోపాటు ఈ ఏడాది కొత్తగా బీఈడీ, డీఈడీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు కూడా డీఎస్సీ రాసేందుకు అర్హత కల్పించాలనే ఉద్దేశ్యంతో మళ్లీ టెట్ నిర్వహించేందుకు సర్కార్ నిర్ణయించింది. అయితే టెట్ కమ్ డీఎస్సీ నిర్వహిస్తుందా.. లేదంటే టెట్, మెగా డీఎస్సీ వేర్వేరుగా నిర్వహిస్తుందా అనే దానిపై ఇప్పటివరకూ క్లారిటీ రాలేదు. నోటిఫికేషన్లు మాత్రం ఒకటేసారి వెలువరించి.. కొంచెం తేదీల మార్పుతో దరఖాస్తులు స్వీకరించనున్నారు. తాజా సమాచారం ప్రకారం.. మొదట టెట్ నిర్వహించి, ఆ తర్వాత డీఎస్సీకి సన్నద్ధమయ్యేందుకు 30 రోజులు సమయం ఇవ్వాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలుస్తుంది.ఈ క్రమంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నోటిఫికేషన్ జూన్ 30 లేదా జులై 1న వెలువడే ఛాన్స్ ఉంది. జగన్ సర్కార్ ఎన్నికల ముందు జారీ చేసిన డీఎస్సీ ప్రకటనను రద్దు చేసిన ఎన్‌డీఏ కూటమి సర్కార్.. కొత్తగా 16,347 పోస్టులకు మెగా డీఎస్సీ ప్రకటించనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. గత డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న వారు ఇప్పుడు కొత్తగా వెలువడనున్న డీఎస్సీకి ప్రత్యేకంగా రుసుములు చెల్లించాల్సిన అవసరం ఉండదు. కానీ, కొత్తగా మరోమారు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. అలాగే కూటమి ప్రభుత్వం అధికారంలో కొనసాగే ఐదేళ్లపాటు ప్రతి ఏడాదీ డీఎస్సీ నిర్వహించే అంశంపై కూడా ప్రభుత్వం సమీక్షలు చేస్తోంది. ఎప్పటి ఖాళీలు అప్పుడే భర్తీ చేసేందుకు డీఎస్సీ నిర్వహిస్తే బాగుంటుందని ప్రభుత్వం యోచిస్తోంది. ఇలా చేయడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని విద్యావేత్తలు సైతం సూచిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందనే దానిపై వేచిచూడాల్సిందే.


### పర్యాటకులకు షాక్..పాపికొండలు విహార యాత్రకు బ్రేక్



తెలంగాణవీణ, ఏపీ బ్యూరో

తూర్పు కనుమల్లోని దట్టమైన అడవితో కూడిన పాపికొండల పర్వతశ్రేణి అందాలు పర్యాటకుల్ని ఆకట్టుకుంటాయి. ఇవి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల నడుమ ఉన్నాయి. చాలామంది యాత్రికులు పాపికొండల విహారానికి వెళ్తుంటారు. గోదావరి పై లాంచీ ప్రయాణం, జలపాతాలు, గ్రామీణ వాతావరణం అందరిని కట్టిపడేస్తాయి. రుతుపవనాల విస్తరణతో తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏపీలో తుఫాను హెచ్చరిక జారీ చేయడంతో పాటు గోదావరి నదిలో నీటి ఉధృతి పెరగడంతో పాపికొండలు విహార యాత్రకు బ్రేక్ పడింది. తాజాగా వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో పాపికొండల విహారయాత్రను నిలిపివేస్తున్నామని అధికారులు తెలిపారు. అనుమతి లేకుండా ఎవరైనా యాత్రకు వెళితే చర్యలు తప్పవని హెచ్చరించారు. 4 రోజుల పాటు యాత్రను నిలిపివేస్తున్నామని అధికారులు తెలిపారు. ఆ తర్వాత పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

### తెలంగాణ టెన్త్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల



* సప్లిమెంటరీ పరీక్షల్లో 73 శాతం మంది విద్యార్థుల ఉత్తీర్ణత
* అబ్బాయిల ఉత్తీర్ణత 71.01 శాతం
* అమ్మాయిల ఉత్తీర్ణత 76.37 శాతం
* ఈ నెల 3 నుంచి 13 వరకు జరిగిన సప్లిమెంటరీ పరీక్షలు
* ఈ పరీక్షలకు మొత్తం 51, 237 మంది విద్యార్థుల హాజరు

తెలంగాణ పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు వెలువడ్డాయి. మధ్యాహ్నం 3 గంటలకు విద్యాశాఖ అధికారులు వీటిని విడుదల చేశారు. సప్లిమెంటరీ పరీక్షల్లో 73 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో అబ్బాయిల ఉత్తీర్ణత 71.01 శాతం కాగా, అమ్మాయిల ఉత్తీర్ణత 76.37 శాతంగా నమోదైంది. అధికారిక వెబ్‌సైట్ https://bse.telangana.gov.in/లో ఫలితాలను అందుబాటులో ఉంచారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్ నెంబరు నమోదుచేసి ఫలితాలు చూసుకోవచ్చు. ఇక పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు జూన్ 3 నుంచి జూన్ 13 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షలకు మొత్తం 51, 237 మంది విద్యార్థులు హాజరయ్యారు.